ఆదిలాబాద్ వార్త
మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్
శుక్రవారం 12, సెప్టెంబర్ 2025

## ఇందిరమ్మ ఇళ్ల విషయంలో
# తప్పు చేస్తే చర్యలు తప్పవు

**ఇందిరమ్మ ఇళ్ల నమూనా భవనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**



బోథ్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

మండలంలోని రిసోర్స్ సెంటర్ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఇంటి లోపల డిజైన్, సౌకర్యాలను పరిశీలించారు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి మండలానికి ఒక మోడల్ హౌస్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం టిజిడబ్ల్యుఆర్‌జెసి రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాల (బాలికల)లో 4 కోట్ల 15 లక్షలతో నిర్మించిన డార్మెటరీ భవనాన్ని ఎక్సైజ్, పర్యాటకం, సంస్కృతి, పురావస్తు శాస్త్ర ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడుతూ కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని తెలిపారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడుతూ, పాఠశాలలో మౌళిక వసతులతో పాటు మెనూ ప్రకారం భోజనం, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక పరిచయ గార్డెన్ లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్ల మంజూరు పత్రాలను, మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, నూతన రేషన్ కార్డులు పంపిణీ, చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరైనా లంచం అడిగిన ఇందిరమ్మ ఇళ్లకు సంబందించి డబ్బులు అడిగితే 9848014089 నెంబర్‌కు మేసేజ్ చేయాలని, ఆయా శాఖలలో వచ్చిన దరఖాస్తులు ఏ అధికారి దగ్గర పెండింగ్ ఉంచకుండా వారం, పక్షం రోజుల్లో పరిష్కరించాలని అన్నారు. ప్రజాపాలనలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తరతరాలు తాతాముత్తాతల నుండి పూరి గుడిసెల్లో ఉన్న ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. బోథ్ నియోజకవర్గంలో పేదవారి కలలను సాకారం చేసేందుకు 5200 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని, ఒక్కొక్క ఇళ్లు 5 లక్షలతో నిర్మించడం జరుగుతుందని, ఒక్క బోథ్ నియోజక వర్గానికి 250 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోలేని వారికి మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి కట్టించే ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. నియోజక వర్గంలో కొత్త రేషన్ కార్డులు 13 వేల మంది రేషన్ కార్డులలో 10, 280 రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని, అలాగే కళ్యాణ లక్ష్మీ, శాదిముభారక్ చెక్కుల విషయంలో జాప్యం లేకుండా పంచాయితీ శాఖ ద్వారా సమావేశాలు నిర్వహించి, మీసేవలో దరఖాస్తులు చేసుకొనేల చర్యలు చేపట్టి 15 రోజుల్లో చెక్కులు మంజూరు అయ్యేలా చూడాలని ఆన్నారు. జిల్లాలో 60,534 మహిళా సంఘాలు ఉన్నాయని వడ్డీ లేని రుణాలు 4 కోట్ల 30 లక్షలు ఇవ్వడం, 159 సంఘాల ద్వారా 1 కోటి 30 లక్షలు ఇందిరమ్మ ఇల్ల రుణాలు బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరిగిందనీ తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు స్వయం సహకార సంఘాల లబ్ధిదారులకు అందజేశారు. మహిళా వికాస జిల్లా సమైక్య సంఘాలకు 41,91,96,267 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, శాసన సభ్యులు అనిల్ జాదవ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుణాత్మక విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

*** జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇంఛార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి**

కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం అనుకోడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, గన్నారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి బోధన పద్ధతులను, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ తరగతిగది కార్యకలాపాలు, ఫౌండేషనల్ లెటర్స్ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. తరగతి గదులలో బోధనా పద్ధతులను పరిశీలించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల అభ్యాసన ప్రక్రియ మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక పద్ధతులను అవలంబించాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరెగూడ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 50 క్వింటాల బియ్యం పట్టివేత

సిర్పూర్ (టి), సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

మండలంలోని టోంకిని గ్రామ సమీపంలోని రైస్ మిల్లులో దాదాపు 50 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు తాసిల్దార్ రహీముద్దీన్ తెలిపారు. వచ్చిన సమాచారంతో ఎస్సై కమలాకర్‌తో పాటు తాము రైస్ మిల్ తనిఖీ చేయగా పిడిఎస్ బియ్యం లభించినట్లు పేర్కొన్నారు. ఆటోలను విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు శుక్రవారం తెలియజేస్తామని పేర్కొన్నారు.



# క్రీడలతో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయి

**● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

విద్యా సంవత్సరంలో ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఒక ముఖ్య ఘట్టమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన ఇన్వెస్టిచర్ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి. దిలీప్ కుమార్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో ఇన్వెస్టిచర్ కార్యక్రమ నిర్వహణ ఒక ముఖ్య ఘట్టమని తెలిపారు. నాయకత్వం ఒక బాధ్యత గల అధికారమని, నిజాయితీ, **మిగతా 2లో..**





# ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యుల నియామకం

**✪ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యుల నియామకం ప్రక్రియ చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లాలో గల ఏరియా ఆసుపత్రి, **మిగతా 2లో..**

# నూతన కోల్ బ్లాక్‌లు వస్తేనే సింగరేణి మనుగడ సాధ్యం

**- కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి - ఏఐటీయూసీ దూరదృష్టి గల కార్మిక సంఘం**

**- ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. సీతారామయ్య, కె. రాజ్ కుమార్**

నస్పూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

సింగరేణికి నూతన బొగ్గు బ్లాగులు వస్తేనే సంస్థ మనుగడ సాధ్యమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్‌లు అన్నారు. గురువారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, నేడు సింగరేణి సీఎండీతో గుర్తింపు సంఘం స్ట్రక్చర్ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని, నూతన ట్రాన్స్‌ఫర్ పాలసీని సరళీకృతం చేయాలని, రెండు సంవత్సరాల మిగులు సర్వీస్ కలిగిన కార్మికులను మెడికల్ బోర్డుకు పిలిచి అన్‌ఫిట్ చేయాలని, కోల్ ఇండియా మాదిరిగా సింగరేణి ఉద్యోగులకు యూనిఫామ్ కొరకు 12,500 రూపాయలు చెల్లించాలని కోరనున్నట్లు తెలిపారు. యాజమాన్యంతో జరుగుతున్న స్ట్రక్చర్ మీటింగ్‌ల వల్ల కార్మికుల పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని అన్నారు. ప్రాతినిధ్య సంఘానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఏఐటీయూసీ దూరదృష్టి గల కార్మిక సంఘం అని, గతంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని కార్మికుల పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. గుర్తింపు సంఘంగా కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, అవసరమైతే సమ్మెకు కూడా సిద్ధమని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు కార్మిక సంఘం విఫలమైందని కొన్ని కార్మిక సంఘాలు తమపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని హితవుపలికారు. మారుపేర్ల సమస్య పరిష్కారానికై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులను కలుస్తామని తెలిపారు. కార్మికుల పిల్లల మెరిట్ స్కాలర్‌షిప్ 8 వేల ర్యాంకు వరకు ఇవ్వడానికి, స్కాలర్‌షిప్ మొత్తం 16 వేలు ఇవ్వడానికి, 14 రకాల అలవెన్స్‌లపై ఈ నెల నుంచి 33 శాతం పెంపుదలకు, డిస్మిస్ అయిన జేఎంఈటిలను విధుల్లోకి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందని, కార్మికుల సొంత ఇంటి పథకం విధివిధానాలు ఖరారు చేయడానికి యాజమాన్యం కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము 2008లో గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడే సొంత ఇంటి పథకానికి యాజమాన్యాన్ని ఒప్పించగా భూపాలపల్లిలో యాజమాన్యం 100 ఎకరాల భూమి కొనుగోలు చేసిందని, కార్మికుల నుంచి దరఖాస్తులు కోరగా కార్మికులు ఆసక్తి చూపకపోవడంతో అదే స్థలంలో క్వార్టర్స్ నిర్మాణం చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో సింగరేణి కార్పొరేట్ ఆసుపత్రి ఏర్పాటుకు నియమించిన కమిటీ ప్రస్తుతానికి అద్దె భవనంలో ప్రారంభించి భవిష్యత్తులో సొంత భావన నిర్మాణం చేపట్టడానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్. ప్రకాష్, కేంద్ర కార్యదర్శి జూపాక రాంచందర్, నాయకులు కొట్టె కిషన్ రావు, అఫ్రోజ్ ఖాన్, చంద్రశేఖర్, సురేష్, మల్లికార్జున్, సుధాకర్, జాడి ఆంజనేయులు వేముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.







## బోథ్ మండలాన్ని అభివృద్ధి చేయాలి

బోథ్, సెప్టెంబర్ 11 ,ప్రభాతవార్త

మండలంలోని స్థానిక పరిచయ గార్డెన్ లో గురువారం నిర్వహించిన సంక్షేమ పథకాల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్షి ్మ చెక్కులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను విన్నవిస్తూ పొచ్చర ఎక్స్ రోడ్ నుంచి బోథ్ వరకు సెంట్రల్ లైటింగ్ డబుల్ లైన్ రోడ్డు మంజూరు చేయాలని అదేవిధంగా బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని అలాగే ప్రముఖ జలపాతాలు అయిన పొచ్చేర, కుంటాల, గాయత్రి, కనకాయి, జలపాతాల అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ మాట ఇవ్వను ప్రయత్నం చేస్తానని తెలిపారు.

## మహిళపై అడవి పంది దాడి

కోటపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామంలో దారుణం జరిగింది. ఉదయం ఇంటి పనులు చేయడానికి ఇంటి పెరడులోకి వెళ్లిన బొల్లవేన మందునక్క (50) అనే మహిళపై అడవి పంది దాడి చేయడంతో మహిళ తీవ్రగాయాల పాలయింది. అడవి పంది దాడి సమయంలో మహిళ గట్టిగా అరుపులు వేయడంతో ఇంట్లోని కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారంతా కలిసి సంఘటన స్థలానికి చేరుకొని అడవిపందిని హత మార్చారు. అనంతరం గాయపడిన మహిళను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందిస్తున్నారు.

## అటవీ అమరులకు నివాళి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం అందర్భంగా బెల్లంపల్లి ఎఫ్‌డీవో కార్యాలయం, ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్యాలయంలో అధికారులు సిబ్బంది అమరవీరులకు గురువారం రోజున నివాళులర్పించారు. రేంజి కార్యాలయంలో ఎఫ్ఫర్వో పూర్ణ చందర్, ఎఫ్డీఓ కార్యాలయంలో కార్యాలయ సూపరింటెండెంట్ గన్ను రామకృష్ణలు అటవీ అమరవీరుల చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేంజి అధికారి పూర్ణ చందర్ మాట్లాడారు. అటవీ సంరక్షణకు ఎంతోమంది సిబ్బంది, అధికారులు తమ ప్రాణాలు త్యాగం చేసినట్లు వారి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రవీణ్ నాయక్, గౌరీ శంకర్, ఎఫ్‌బివోలు శంకర్ రావు, యుగంధర్, కుమారస్వామి, గోపి కృష్ణ, భాస్కర్, శ్రీధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## అధికారులతో సమీక్ష సమావేశం

వేమనపల్లి,సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కుమారస్వామి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు,ఉపాధి హామీ సిబ్బందికి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్‌లో ఫోటో అప్లోడింగ్, ప్లాంటేషన్ పేమెంట్స్, హార్టికల్చరూ రైతుల ఎంపిక, పారిశుధ్య కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి, పంచాయతీ రాజ్ పనులు పురోగతి, పనుల జాతర పనుల ఎంపిక పనులు మొదలు, ఎస్బియం పనులపైన అధికారులకు సమీక్ష నిర్వహించారు. ఏపీఓ మహేశ్వర్ రెడ్డి టీఎలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.



## క్రీడలతో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయి

(మొదటిపేజీ తరువాయి)

పట్టుదల, సేవా దృక్పథం ద్వారా సమాజాన్ని ప్రభావితం చేయగలరని తెలిపారు. నాయకత్వం అనేది అధికారం కోసం కాదని, సేవ కోసం అని, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలలో రాణిస్తూ, సమాజంలో జరిగే ప్రతి విషయంపై అవగాహన పెంచుకోవాలని, మానవ విలువలను కాపాడాలని తెలిపారు. సరైన నిర్ణయం తీసుకోవడంలో సామాన్యుడికి, నాయకుడికి భేదాలు ఉంటాయని, పాఠశాల స్థాయి నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలు మాట్లాడగలుగుతారని, డైవర్సిటి వల్ల ఇన్నోవేషన్, నాలెడ్జ్ పెంపొందుతాయని తెలిపారు. మంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్, అర్హత వల్ల నేర్చుకోవడం సులభమని తెలిపారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని, నిర్ణయం తీసుకోవడంలో నాణ్యత పాటిస్తే పరిస్థితులు మారతాయని, సామర్థం పెరుగుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలు పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవాలని, అందుబాటులో ఉన్న వనరులతోనే ఎక్కువ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇంటర్ తర్వాత ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, ప్రతి దానిలో నిర్ణయం తీసుకోవడమే ప్రాధాన్యమని తెలిపారు. మంచి నిర్ణయంతో జరిగే మార్పులతో జిల్లాను, రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుండి నడిపే అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాల ఎన్నికల ద్వారా ఎంపికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, ఇతర విద్యార్థి నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. యువ నాయకులను అభినందిస్తూ క్రమశిక్షణ, నైతికత, సేవాభావం, నాయకత్వం వంటి విలువలను పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఇన్వెస్టిచర్ లాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రజాస్వామిక భావనలు, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించడంలో ముఖ్యపాత్ర వహిస్తాయని అన్నారు. అంతకు ముందు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యుల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక ఆసుపత్రులలో పని చేసేందుకు 23 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్), ఎం.బి.బి.ఎస్. పోస్టుల భర్తీ కొరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకుల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూకు 15 మంది హాజరయ్యారని, వీరిలో 2 స్పెషలిస్ట్ డాక్టర్లు, 11 మంది ఎం.బి.బి.ఎస్. డాక్టర్లు ఎంపిక అయ్యారని తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామకం ద్వారా ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

## ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులభం

**- సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ వెంకటేశ్వర్లు**

మందమర్రి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తో కలిసి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ వెంకటేశ్వర్లు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అధికారులతో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కేకే ఓసీపీ, పి. ఓ. బి ప్లాంటును సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు ఉత్పత్తి ఉత్పాదకత పెంపొందించడానికి తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులువుతుందని అన్నారు. వర్షాకాలంలో ఉత్పత్తికి విఘాతం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అంతే కాకుండా కేకే ఓసీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పి. ఓ. బి ప్లాంట్ పనుల యొక్క వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని వారికి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ ప్రసాద్, కెకె ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, గని మేనేజర్ రామరాజు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏరియ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## సిర్పూర్ నియోజకవర్గంలో బెంగాలీ టీచర్లను నియమించాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు**

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

సిర్పూర్ నియోజకవర్గంలోని బెంగాలీ క్యాంపుల్లో చదువుతున్న విద్యార్థులు బెంగాలీ మాతృభాషలో బోధించగల ఉపాధ్యాయుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గురువారం హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్‌ను సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ, బెంగాలీ భాషలో నైపుణ్యం ఉన్న అభ్యర్థులను ఆయా క్యాంపుల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నిర్మించాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా సభ్యసాచి ఘోష్ స్పందిస్తూ, త్వరలోనే సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## 208 దరఖాస్తులకు ప్రొసీడింగ్‌లు జారీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణ మున్సిపాలిటీలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద ఇప్పటివరకు మొత్తం 1886 దరఖాస్తులు అందాయని, వీరిలో 290 మంది పూర్తి ఫీజు చెల్లించారని పూర్తి ఫీజు చెల్లించిన దరఖాస్తుల్లో 208 దరఖాస్తులకు స్థల పరిశీలన అనంతరం ప్రొసీడింగ్‌లు జారీ చేయబడినట్టు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ యశ్వంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా మిగిలిన 82 దరఖాస్తులు దరఖాస్తుదారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఈ దరఖాస్తుదారులు తక్షణం మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి తమ స్థలాలపై పరిశీలన చేయించుకొని ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ యశ్వంత్ కుమార్ సూచించారు.

## అటవీ భూములను పరిరక్షించాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిది

**- సింగరేణి పర్యావరణ, అటవీ శాఖ సలహాదారు మోహన్ పరిగన్**

బెల్లంపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

సింగరేణి పర్యావరణ మరియు అటవీ శాఖ సలహాదారు మోహన్ పరిగన్ బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డితో కలిసి గురువారం పర్యటించారు. గోలేటి ఉపరితల గని పరిధిలోని అటవీ శాఖ భూములు, వృక్షాల వివరాలను ఏరియా అధికారుల ద్వారా తెలుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకొని జిల్లా అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. గోలేటి ఉపరితల గని అటవీ శాఖ అనుమతులు త్వరగా వచ్చేలా చూస్తున్నామని తెలిపారు. గోలేటి సి హెచ్ పి వద్ద మొక్కలు నాటారు. గతంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అటవీ భూములను పరిరక్షించాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్. తిరుపతి, బయ్య మొగిలి, ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, గోలేటి ఓసి పీవో ఎన్. ఉమాకాంత్, సిహెచ్పి ఇంచార్జి కోటయ్య, ఎస్టేట్ అధికారులు సాగర్, రజినీకాంత్, జూనియర్ ఫారెస్ట్ అధికారిణి సుష్మ తదితరులు పాల్గొన్నారు.



# అధ్వానంగా ఇచ్చోడ బస్టాండ్

ఇచ్చోడ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



మండలంలోని భారీ వర్షాలకు స్థానిక బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు అధికంగా వచ్చి చేరడంతో వచ్చిపోయే ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతుంది నిర్మల్ అదిలాబాద్ నుండి వచ్చి పోయే బస్సులు మండలంలోని ప్రధాన రహదారి గుండా రాకపోవడంతో సిరికొండ, బజార్హత్నూర్ మండలాలకు వెళ్లే ప్రయాణికులు నానా కష్టాలు పడుతూ అదనంగా ఆటో చార్జీలు చెల్లించలేక లబోదిబోమంటున్న ప్రయాణికులు అధికారులు సమస్యను గుర్తించి పరిష్కారం చూపే విధంగా చొరవ తీసుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

# కాంగ్రెస్ కండువా కప్పుకున్న 124 మంది యువకులు

బోథ్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల సందర్భంగా, పీఏసీఎస్ డైరెక్టర్ చాట్ల ఉమేష్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి, మంత్రి జూపల్లి కృష్ణారావు , నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి మొత్తం 124 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే, యువ నాయకుడు, వ్యూహకర్త అలపాటి అచ్యుతానంద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ కౌసర్, షేక్ షబీర్, అమెర్ కూడా కాంగ్రెస్ కండువా ధరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో వీరిని పార్టీ లోకి ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అంకితభావంతో కృషి చేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. అలాగే, పార్టీ విస్తరణలో ముఖ్య పాత్ర పోషిస్తున్న చట్ల ఉమేష్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి , గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య , మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, కాంగ్రెస్ విచార్ విభాగ్ రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్, మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి

**- బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ డిమాండ్**

బెల్లంపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త




గ్రూప్ వన్ పరీక్ష నిర్వహణంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విఫలమైనందున నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ బుర్ర వెంకటేశం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తు గురువారం రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మాట్లాడుతు, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ టిజిఎస్పిసి చైర్మన్ బుర్ర వెంకటేశం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అదేవిదంగా అందరి అభ్యర్థులకు 28 కేంద్రాల్లో సెంటర్లు కేటాయించగా కోటి ఉమెన్స్ కాలేజీలో మహిళ అభ్యర్థులకి ప్రత్యేకంగా రెండు సెంటర్లలో 71 మంది ఎంపికయ్యారు. మిగిలిన 26 సెంటర్లో 139 మంది ఎంపికయ్యారు ఇది ఎలా సాధ్యం అయన ప్రశ్నించారు. ముఖ్యంగా 563 ఉద్యోగాలలో కేవలం 9 శాతం మంది మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నట్లు టీజీపీఎస్సీ షీల్డ్ కవర్లో పేర్కొందని, ఇంగ్లీష్ లో 12,381 మంది పరీక్ష రాస్తే 508 మంది ఎంపికయ్యారు, తెలుగులో 8,694 మంది పరీక్ష రాస్తే కేవలం 56 మంది మాత్రమే ఎంపికయ్యారు. దీనివల్ల తెలుగు మీడియం చదివిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని అభ్యర్థులు రీకౌంటింగ్ అప్లికేషన్ చేసుకుంటే వాళ్లకు మార్కులు తగ్గాయని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్. రెండు హాల్టికెట్స్ గతంలో 2011 ఇచ్చినం అని గౌరవ హైకోర్టుకి తెలిపిన కమిషన్ ఆ రోజు సమాఖ్య రాష్ట్రంలో నాటి కమిషన్ చైర్మెన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్యాయం జరిగింది అని పోరాడినం, ఇప్పుడున్న కమిషన్ అదే విధానాన్ని అనుసరించటం వల్ల గ్రూప్ 1 అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బడికల శ్రావణ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భారస విద్యార్థి విభాగం సీనియర్ నాయకులు అసంపెల్లి సంపత్, ఎండి ముస్తాఫా,బెల్లం అరుణ్,సీపల్లి సాగర్,బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ఆడెపు అరుణ్, చెన్నూరు పట్టణ అధ్యక్షులు ఎండి నాయబ్, వేమనపల్లి మండల అధ్యక్షులు బుర్రి రమేష్ గౌడ్, దాసరి నవీన్, సిహెచ్ రమేష్, రామిడి లక్ష్మీకాంత్, చంద్రకిరణ్, బాపు నాయక్, రాజు యాదవ్, చెన్నూరు ప్రసాద్, అజయ్, డిఆర్ఎస్వి కార్యకర్తలు పాల్గొన్నారు.